క్లుప్తంగా

సాయికిరణ్‌కు పీహెచ్‌డీ ప్రదానం



సాయికిరణ్‌కు పీహెచ్‌డీ అందజేస్తున్న ఇన్‌చార్జి వీసీ శ్రీనివాసరావు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలోని డిపార్టుమెంట్ ఆఫ్ జియో సైన్సెస్‌కు సంబంధించిన జియాలజీ విభాగం నుంచి కె.సాయి కిరణ్ పీహెచ్‌డీ అందుకున్నారు. శ్రీకాకుళం జిల్లాలోని 'కోస్టల్ జలాశయాలలో ఉప్పునీటి చొరబాటు, భూగర్భ జల నాణ్యత మూల్యాంకనంపై రిమోట్ సెన్సింగ్ అండ్ జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్‌ను ఉపయోగించి సమగ్ర అధ్యయనం' అనే అంశంపై ఆయన పరిశోధన చేశారు. ఈ మేరకు ఇన్‌చార్జి వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు చేతుల మీదుగా పట్టా అందుకున్నారు. ఈ పరిశోధనకు గైడ్‌గా ప్రొఫెసర్ కె.నూకరత్నం వ్యవహరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కుల దినోత్సవం

రాజానగరం: స్థానిక గైట్ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా హెబీఎస్ హెచ్ఓడీ డాక్టర్ ఎం. సావిత్రి, కామర్స్ అండ్ మేనేజ్మెంట్ హెచ్ఓడీ డాక్టర్ సీహెచ్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి ఏటా డిసెంబర్ 10న అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ కాళీకృష్ణ, వలంటీర్లు పాల్గొన్నారు.

రైసుమిల్లుల తనిఖీ

మధురపూడి: కోరుకొండలోని రైసుమిల్లులను జిల్లా జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు మంగళవారం తనిఖీ చేశారు. కాపవరం, కోరుకొండ, పశ్చిమగానుగూడెం గ్రామాల్లోని రైసుమిల్లలకు వద్దకు వెళ్లి పరిశీలించారు. తొలుత కోరుకొండలో లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు.

పన్నుల వసూలు వేగవంతం చేయాలి

పెదపూడి: గ్రామ పంచాయతీ పరిధిలో ఇంటి పన్నులు, ఇతర పన్నుల వసూళ్లు వేగంగా చేపట్టాలని ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి సచివాలయ కార్యదర్శులకు ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయం కార్యదర్శులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య పనులపై అధికారుల పర్యవేక్షణ ఉండాలన్నారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయాలన్నారు. గ్రామాల్లో దోమలు మందు పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు బి.ప్రసన్నకుమార్, స్వామి, తరుణ్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు



సీతానగరంలో స్మార్ట్ మీటర్లు అమర్చుతున్న సిబ్బంది

సీతానగరం: ప్రీ పెయిడ్ విద్యుత్ మీటర్ల అయిన స్మార్ట్ మీటర్ల ఏర్పాటు మండలంలో జోరుగా సాగుతోంది. కేటగిరీ –4లోని పంచాయతీలు, వీధిలైట్లు, డ్రింకింగ్ వాటర్ ప్లాంట్లు, దుకాణాలు, పాఠశాలలు, చర్చిలు, దేవాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలకు ప్రయోగాత్మకంగా వీటిని అమర్చుతున్నారు. ఈ మేరకు మండలానికి 356 మీటర్లు కేటాయించారు. వీటిని సీతానగరం పంచాయతీ పరిధిలో అమర్చే పనులను కాంట్రాక్టు సిబ్బంది చేపట్టారు. అమర్చిన మీటర్లును సర్వీస్ కనెక్షన్‌కు అనుసంధానం చేసి యాక్టివేషన్ చేస్తున్నారు. ఆయా గ్రామాల పరిధిలో లైన్‌మన్లు, లైన్ ఇన్‌స్పెక్టర్ల పర్యవేక్షణలో మీటర్లను అమర్చనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ కట్టా చంద్రమోహన్ తెలిపారు.

హెచ్‌ఆర్సీ జాయింట్ సెక్రటరీగా కుసుమంచి



కృష్ణంరాజుకు ధ్రువపత్రం అందిస్తున్న సింహాచలం

రంగంపేట: మానవ హక్కుల నేర నిరోధక సంఘం జిల్లా జాయింట్ సెక్రటరీగా రంగంపేట గ్రామానికి చెందిన కుసుమంచి కృష్ణంరాజును నియమించినట్టు ఆ సంఘం రాష్ట్ర సెక్రటరీ సింహాచలం తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా రంగంపేటలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కృష్ణంరాజును ఎంపిక చేసి ధ్రువపత్రం అందించినట్టు తెలిపారు. 2025 మార్చి 14 వరకు ఆయన ఈ పదవిలో కొనసాగుతారని చెప్పారు.

వ్యాధుల కాలం.. జాగ్రత్తలతో దూరం

- అనూహ్యంగా తగ్గుతున్న ఉష్ణోగ్రతలు
- పెరుగుతున్న సీజనల్ వ్యాధులు
- వృద్ధులు, చిన్నారులకు తప్పని అవస్థలు



రహదారిపై కురుస్తున్న మంచులో ప్రయాణాలు సాగిస్తున్న వాహన చోదకులు



సంపర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

పెదపూడి: వాతావరణ మార్పులతో ఇటు పెద్దలు, అటు చిన్నారులు సాధారణ జ్వరాలు, ఉబ్బసం, దగ్గు తదితర వ్యాధుల బారిన పడుతున్నారు. సాధారణం కంటే ఉష్ణోగ్రతలు తగ్గి చలి పెరుగుతోంది. దీంతో అనపర్తి నియోజకవర్గం నాలుగు మండలాల్లో ఉదయం 7 గంటల వరకు మంచు తెరలు వీడటం లేదు. అనంతరం క్రమంగా ఉష్ణోగ్రతలు పెరిగి మరలా సాయంత్రం 5 గంటల నుంచి చలి మొదలవుతోంది. మరలా రాత్రి 10 గంటలకే మంచు తెర పరుచుకుంటోంది. దీంతో వృద్ధులు, చిన్నారులకు అవస్థలు తప్పడం లేదు. మంచు కురిసే చలికాలంలో వచ్చే వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. ఈ వ్యాధుల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను అంతా తప్పనిసరిగా పాటించాల్సి ఉంది.

అనపర్తి నియోజకవర్గంలో అనపర్తి, బిక్కవోలు, పెదపూడి, రంగంపేట మండలాలు ఉన్నాయి. ఈ నాలుగు మండలాల్లో కొంకుదురు, బిక్కవోలు, సంపర, పెద్దాడ, రామవరం, కుతుకులూరు, రంగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో, పెదపూడి సమాజిక ఆరోగ్యకేంద్రం, అనపర్తి ఏరియా ఆస్పత్రుల్లో గత పది రోజులుగా పిల్లలు, పెద్దవారికి జ్వరం, దగ్గు కేసులు సుమారు 205 పైగా నమోదైనట్లు వైద్యులు తెలిపారు. ఆయా ఆస్పత్రుల్లో ఈ వ్యాధుల నివారణకు అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయి

చిన్నారులకు న్యూమోనియా

పిల్లలకు చల్లని గాలి తగిలిన వెంటనే న్యోమోకోకల్ వైరస్ వారిలో ప్రవేశించి న్యూమోనియా వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా 3 నుంచి 5 సంవత్సరాల లోపు చిన్నారులకు ఉబ్బసం వ్యాధి అధికంగా వస్తుంది. వ్యాధి ప్రభావంతో ఊపిరితిత్తులకు ప్రాణవాయువు పంపిణీ సరైన రీతిలో సాగదు. దీని ఫలితంగా తీవ్రమైన దగ్గు, ముక్కు కారడం, అధిక జ్వరం వస్తుంది. సకాలంలో చికిత్స చేయించకపోతే ఉబ్బసం వ్యాధికి దారి తీస్తుంది. వ్యాధి తీవ్రమయ్యే కొద్ది చర్మం నీలం రంగులోకి మారి మెదడుకు ఆక్సిజన్ అందక మార్చ వచ్చే ప్రమాదం కూడా ఉంది.

ఆస్తమాతో అవస్థలెన్నో

పోషకాహార లోపంతో పిల్లలు, పెద్దల్లో అస్తమా వ్యాధి వృద్ధి చెందుతుంది. వ్యాధి గ్రస్తులు ముఖ్యంగా జలుబు, దగ్గు సమస్యతో అధికంగా బాధ పడుతుంటారు. జ్వరం 102 డిగ్రీలకు చేరడం, కోరింత దగ్గు, ముక్కు నుంచి నీరు కారడం వంటివి వ్యాధి లక్షణాలుగా ఉంటాయి. 40 ఏళ్ల వయస్సు పైబడిన వారిలో ఈ లక్షణాలు అధికంగా కనబడతాయి.

చర్మవ్యాధులతో ఇబ్బందులు

శీతాకాలంలో ఉష్ణోగ్రతలు పడిపోవడంతో చర్మ వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. విటమిన్ డీ లోపంతో దద్దుర్లు, చర్మం పగుళ్లు రావడం జరుగుతుంది. అందుకే చలికాలంలో బయట తిరిగేటప్పుడు చర్మంపై దుమ్ము, ధూళి పడకుండా తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలి.

నివారణ చర్యలివే..

- చిన్న పిల్లలను చలిలో బయట తిరగకుండా చూడాలి.
- వెచ్చని దుస్తులు(ఉన్ని దుస్తులు) ధరింపజేయాలి.
- ఇంట్లో వెచ్చగా ఉండేలా హీటర్లు వినియోగించుకోవాలి.
- పిల్లలు నిద్రించే ప్రదేశంలోకి చల్లని గాలి చొరబడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.
- వ్యాధి బారిన పడిన చిన్నారులకు సరైన చికిత్స అందిస్తే మూడు నుంచి వారం రోజుల్లో ఇబ్బందిని అధిగమించవచ్చు.
- ఉదయాన్నే గోరువెచ్చని నీటిలో రెండు చెంచాల నిమ్మరసం కలుపుకొని తాగాలి. దీంతో ఊపిరితిత్తుల్లో గాలి ప్రసరణ బాగా జరుగుతుంది.
- వ్యాయామం, నడకతో శరీరంలో ఉష్ణోగ్రత పెరిగి రక్త ప్రసరణ సక్రమంగా జరుగుతుంది.

వ్యాధి నిరోధక శక్తిని పెంచుకోవాలి

చిన్నారుల్లో వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. దీంతో శీతాకాలంలో త్వరగా వ్యాధులకు గురయ్యే అవకాశం ఉంది. పిల్లలకు తల్లిపాలు శ్రేష్ఠమైనవి. వాటితో పాటు పౌష్టికాహారాన్ని అందించాలి. పిల్లలకు అనారోగ్యంగా ఉన్నప్పుడు వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లాలి. శీతాకాలంలో వచ్చే న్యూమోనియాపై అవగాహన పెంచుకోవాలి.



పి.అనూష , సూపరింటెండెంట్, సామాజిక ఆరోగ్య కేంద్రం, పెదపూడి.

ఈ-పంట నమోదు తప్పనిసరి



రఘుదేవపురంలో ఈ - పంట నమోదును పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

రాజానగరం: దాళ్వా సీజన్‌లో పంటలు పండించే రైతులందరూ ఈ - పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎస్‌కే ఇమామ్ ఖాసిమ్ అన్నారు. దీనివల్ల ప్రభుత్వం నుంచి వ్యవసాయ పథకాలను పొందడానికి అవకాశం ఉంటుందన్నారు. వరి సాగు చేసే రైతులు ఈ నెలాఖరులోపు పంటల బీమా చేయించుకోవాలన్నారు. ఇందుకు ఎకరానికి రూ.630 ప్రీమియంగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. సమీపంలోని బ్యాంకు, కామన్ సర్వీస్ సెంటర్, రైతు సేవాకేంద్రాలలో ప్రీమియం చెల్లించి, నమోదు చేయించుకోవచ్చన్నారు. మండలంలోని కలవచర్లలో రబీ సీజన్‌లో సాగు చేస్తున్న కొన్ని పొలాలను మంగళవారం సందర్శించి, ఈ-పంట నమోదు ప్రక్రియను పరిశీలించారు.

సీతానగరం: మండలంలోని రైతులు రబీలో వేసిన పంటలకు ఈ-పంట నమోదు చేసుకోవాలని ఇన్‌చార్జి ఏవో తులసి సూచించారు. రఘుదేవపురంలో జరుగుతున్న ఈ-పంట నమోదు కార్యక్రమాన్ని ఏడీఏ మల్లికార్జునరావుతో కలిసి మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి రైతు తాము పండిస్తున్న పంటలకు తప్పనిసరిగా బీమా చేసుకోవాలన్నారు. దానికి ఈ - పంట నమోదు అవసరమన్నారు.

విద్యార్థుల స్థాయి ఆధారంగా బోధించాలి

- ఆర్‌జేడీ నాగమణి
- ఎఫ్ఎల్ఎన్ శిక్షణ ప్రారంభం



మాట్లాడుతున్న ఆర్‌జేడీ నాగమణి

రాజానగరం: విద్యార్థుల స్థాయి ఆధారంగా విద్యాబోధన చేసినప్పుడే ఆ విద్యార్థులలో అభ్యసనా సామర్థ్యం పెరుగుతుందని పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీ జి.నాగమణి అన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, ఎంఈఓలకు మండలంలోని కొండగుంటూరులో జరుగుతున్న ఎఫ్ఎల్ఎన్ శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాల స్థాయిలో ఒకటో తరగతి విద్య పునాదిగా ఉంటుందన్నారు. విద్యార్థికి భాష, గణితంలో అవసరమైన ప్రాథమిక పరిజ్ఞానాన్ని అందించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యా బోధనతో ప్రభుత్వ పాఠశాలలపై సమాజానికి నమ్మకం కలిగేలా కృషి చేయాలని, అప్పుడే ప్రభుత్వ పాఠశాలలు పూర్వ వైభవం పొందడానికి అవకాశం ఉంటుందన్నారు. ప్రస్తుతం పాఠశాలలో కనిపిస్తున్న ఎన్‌రోల్‌మెంట్ ఆందోళనకరంగా ఉంటుందన్నారు. దీనిపై ప్రతి ఉపాధ్యాయుడు దృష్టిపెట్టి ఎన్‌రోల్‌మెంట్ పెరిగేలా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. ఇక్కడ పొందిన శిక్షణను సద్వినియోగం చేసుకుంటూ ప్రభుత్వ పాఠశాలల అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. శిక్షణ కార్యక్రమ విధానాన్ని ఆర్‌జేడీకి కోఆర్డినేటర్ పి.రాంబాబు వివరించారు. కార్యక్రమంలో డైట్ లెక్చరర్ సుజాత రత్నం, ప్రథమ్ రాష్ట్ర పరిశీలకుడు ధనిమిరెడ్డి గీతారమ్య, జిల్లా కో ఆర్డినేటర్ వంశీకృష్ణ, వి.నాగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అడుగడుగునా మానవ హక్కుల ఉల్లంఘన



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సూర్యనారాయణ తదితరులు

సీటీఆర్ఐ/రాజమహేంద్రవరం సిటీ: భారత రాజ్యాంగ చట్టాలను, కోర్టు తీర్పులను సక్రమంగా అమలు చేయకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అడుగడుగునా మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతున్నాయని ఆదివాసీ మహాసభ న్యాయ సలహాదారు అయినాపురపు సూర్యనారాయణ ధ్వజమెత్తారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా పోలవరం నిర్వాసితుల హక్కుల ఉల్లంఘనపై పోస్టర్‌ను ఆవిష్కరించారు. సూర్యనారాయణ మాట్లాడుతూ మానవ హక్కుల ఉల్లంఘనలో ప్రభుత్వాలే మొదటి స్థానంలో ఉన్నాయని ఆరోపించారు. తాము చేసిన చట్టాలను, ఇచ్చిన ఉత్తర్వులను అవే ప్రభుత్వాలు అమలు చేయకపోవడం మావనహక్కుల ఉల్లంఘన కిందకే వస్తుందని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పోలవరంపై మరో శ్వేతపత్రం విడుదల చేసి కేంద్రం ఇస్తున్న రూ.12,517 కోట్లలో ఆర్అండ్ఆర్ ప్యాకేజీకి, భూసేకరణకు చేసే కేటాయింపులను ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో చెల్లం శేఖర్, సంతోష కుమారి, గడుతూరి చిన్నారావు, అరగంటి వీరభద్రారెడ్డి పాల్గొన్నారు.

వినూత్నంగా మానవ హక్కుల దినోత్సవం

కంబాలచెరువు: స్థానిక ఆర్ట్స్ కళాశాలలో మంగళవారం మానవ హక్కుల దినోత్సవాన్ని వినూత్నంగా నిర్వహించారు. విద్యార్థులతో మానవ హక్కుల గురించి చెప్పించడం ఆకట్టుకుంది. రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెమినార్ హాలులో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులతో డిబేట్ నిర్వహించారు. రాజనీతి శాస్త్ర అధ్యాపకురాలు డాక్టర్ కె.సీతామహాలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దడానికి నైతిక విలువలు అవసరమన్నారు. అలాగే మానవ హక్కుల ఆవశ్యకతను వివరించారు. రాజనీతి శాస్త్ర అధ్యాపకురాలు సయ్యద్ ఫరా ఎఫ్రూస్ మాట్లాడుతూ పిల్లలలో నైతిక విలువలను పెంపొందించడంతో పాటు, మానవ హక్కులను ఉల్లంఘించకుండా వారిని తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే మాట్లాడుతూ ఇలాంటి వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించిన రాజనీతి శాస్త్ర విభాగాన్ని కొనియాడారు.

ఉద్యోగం పేరుతో మోసం

రాజమహేంద్రవరం రూరల్: ఉద్యోగం పర్మినెంట్ చేయిస్తానని చెప్పి తనను వశపర్చుకుని, చివరకు మోసం చేశాడంటూ పేపరుమిల్లు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌పై ఓ మహిళ ఫిర్యాదు చేసింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. బొమ్మూరుకు చెందిన ముత్యాల అరుణకుమారికి ఇద్దరు పిల్లలు. ఆమె భర్త పదేళ్ల క్రితం వదిలి వెళ్లిపోయాడు. ఆమె 2021 నుంచి కడియం పేపరుమిల్లులో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తోంది. ఈ నేపథ్యంలో పేపరుమిల్లు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ముఖేష్ జైన్‌తో ఆమెకు పరిచయం ఏర్పడింది. ఆమె ఉద్యోగాన్ని పర్మినెంట్ చేస్తానని, ఆమె కుమారుడికి ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి ముఖేష్‌జైన్‌ను ఆమెను వశపర్చుకున్నాడు. ఇప్పుడు ఉద్యోగం గురించి అడుగుతుంటే చంపుతానని బెదిరిస్తున్నాడు. ఈ విషయాన్ని పేపరుమిల్లు జీఎంకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. బాధితురాలి ఫిర్యాదు మేరకు బొమ్మూరు ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'నల్లమిల్లి అసత్య ప్రచారాలు మానుకోవాలి'

- అంబేడ్కర్ వర్ధంతి ఘటనపై కావాలనే రాద్ధాంతం
- వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులకు పాల్పడితే మూల్యం చెల్లించక తప్పదు
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: అంబేడ్కర్ వర్ధంతి ఘటనపై అసత్య ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అంబేడ్కర్ విగ్రహం ముందు క్షమాపణ చెప్పాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి డిమాండ్ చేశారు. అనపర్తి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆయన మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కి తన సొంత రాజ్యాంగంతో పరిపాలన చేస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డికి రాజ్యాంగం గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి తడబడ్డారా లేక అంబేడ్కర్ పేరు పలకడం తనకు ఇష్టం లేదా అని ప్రశ్నించారు.

వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బ్యాక్ గ్రౌండ్ ఫ్లెక్సీలో ఒక వైపు మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఫోటో, మరో వైపు తన ఫోటో మధ్యలో నవరత్నాల సింబల్ ఉంటుందన్నారు. కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటం ఏర్పాటు చేసి వర్ధంతి కార్యక్రమాన్ని చేసినప్పుడు వెనుక ఉన్న బ్యాక్ గ్రౌండ్ ఫ్లెక్సీ అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమ ఫోటోలో కవర్ అయిందన్నారు. అంబేడ్కర్ అంటే తమకు అపార గౌరవం ఉందన్నారు. ప్రతిపక్ష పార్టీలో పనిచేసిన వారిని నల్లమిల్లి తన అనుచరులతో ఇంటికి తీసుకుని వెళ్లి అక్కడ వైఎస్సార్ సీపీ కార్యకర్తలను హింసిస్తున్నారని ఆరోపించారు. ప్రతిపక్ష పార్టీ కోసం పనిచేసిన వారిని ఇంటికి తీసుకెళ్లి హింసించమని భారత రాజ్యాంగం మీకు చెప్పిందా అని ప్రశ్నించారు. మీరు చేస్తున్న దౌర్జన్యాలపై ప్రజల్లో తిరుగుబాటు మొదలైందని, త్వరలోనే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కర్రి దాసు, పార్టీ నేత నందికోళ్ల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

14న సాగునీటి సంఘాల ఎన్నికలు



సమావేశంలో పాల్గొన్న ఎంపీడీవో భారతి, తహసీల్దార్ శ్రీనివాస్

సీతానగరం: సాగునీటి సంఘాల ఎన్నికల షెడ్యూల్ బుధవారం విడుదల అవుతుందని, ఈ నెల 14న ఎన్నికలు నిర్వహిస్తామని తహసీల్దార్ ఎ.శ్రీనివాస్, ఎంపీడీవో ఎం.భారతి, జలవనరులశాఖ ఏఈ శివరామకృష్ణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బంది, వీఆర్వోలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తొర్రిగడ్డ పంపింగ్ స్కీమ్ పరిధిలోని పురుషోత్తపట్నం, చినకొండేపూడి, మునికూడలి, రఘుదేవపురంతో పాటు తోట వెంకటాచలం పుష్కర ఎత్తిపోతల పథకం పరిధిలోని నాగంపల్లి సాగునీటి సంఘాలలో ఎన్నికలు జరుగుతాయన్నారు. ఆయా గ్రామాలలో సుమారు 14 వేల మంది రైతులు ఉన్నారని, 2022 నాటికి నీటి పన్ను బకాయి లేకుండా చెల్లించిన వారు ఎన్నికల్లో పోటీ చేయవచ్చన్నారు. ఆయా గ్రామాల పాఠశాలల్లో ఈనెల 14న ఎన్నికలు జరుగుతాయన్నారు. ముందుగా సంఘానికి ఆరుగురు సభ్యులను ఎంపిక చేస్తారని, వారిలో అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడిగా ఎన్నుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో నాగ శేషవేణి, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నమెంట్ విజేత రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల



టోర్నమెంట్ విజేతగా నిలిచిన రాజమహేంద్రవరం జట్టు

పెదపూడి: క్రీడాకారులు క్రీడల్లో రాణించి ఉన్నత స్థానాలు అధిరోహించాలని జి.మామిడాడ డీఆర్‌కే రెడ్డి కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ సబ్బెళ్ల శివన్నారాయణరెడ్డి అన్నారు. ఈ కాలేజీ ఆధ్వర్యంలో చేపట్టిన ఇంటర్ కాలేజీ పురుషుల వాలీబాల్ టోర్నమెంట్ యూనివర్సిటీ టీం సెలక్షన్లు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా శివన్నారాయణరెడ్డి మాట్లాడుతూ టోర్నమెంట్‌ను నాకౌట్ కమ్ లీగ్ పద్ధతిలో నిర్వహించారన్నారు. సెమీ ఫైనల్‌కు చేరిన రాజమహేంద్రవరం ఆర్ట్స్ కాలేజీ, భీమవరం డీఎన్ఆర్ కాలేజీ, తాడేపల్లి గూడెం గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ, కాకినాడ ఐడీయల్ కాలేజీ జట్ల మధ్య పోటీ ఉత్కంఠగా సాగిందన్నారు. పోటీల్లో రాజమహేంద్రవరం జట్టు విన్నర్‌గా, డీఎన్ఆర్ కాలేజీ జట్టు రన్నర్‌గా, తృతీయ స్థానంలో తాడేపల్లిగూడెం డీఆర్‌జీ గవర్నమెంట్ కాలేజీ, నాల్గో స్థానంలో కాకినాడ ఐడీయల్ కాలేజీలు నిలిచాయన్నారు. టోర్నమెంట్‌లో 26 టీంలు పాల్గొన్నాయన్నారు. మొత్తం 30 మంది ఉత్తమ ప్రదర్శన చేసిన క్రీడాకారులను ఎంపిక చేసి వారిలో 12 మందిని ఆదికవి నన్నయ యూనివర్సిటీ టీంగా ఎంపిక చేశారన్నారు. ఈ టీం త్వరలో కేరళలో జరిగే ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొంటుందన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన కాలేజీ ఫౌండర్ డీఆర్‌కే రెడ్డి, కరస్పాండెంట్ ద్వారంపూడి వివేకనందరెడ్డి విజేత జట్లుకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌కే డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ టీ.శ్రీనివాసారెడ్డి, యూనివర్సిటీ అబ్జర్వర్ సత్యనారాయణ, కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

రాజమహేంద్రవరం రూరల్: సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ ఉమా మహేశ్వరరావు అన్నారు. కాతేరులోని వ్యవసాయ కళాశాలలో అసోసియేట్ డీన్ డాక్టర్ డి.శ్రీనివాస్ అధ్యక్షతన మంగళవారం సైబర్ క్రైమ్, సైబర్ సెక్యూరిటీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ వివిధ యాప్‌ల ద్వారా నేరగాళ్లు అనేక మార్గాల్లో మోసాలు చేస్తున్నారన్నారు. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లలో వ్యక్తిగత చిత్రాలను, వివరాలను పంపవద్దన్నారు. కొత్త కాల్స్‌ను నమ్మి మోసపోవద్దని, తెలియని వారితో చాటింగ్ ప్రమాదకరమన్నారు. సైబర్ క్రైమ్ టీం సభ్యులు సైబర్ క్రైమ్స్, సైబర్ సెక్యూరిటీ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శాశ్వత పందిరి నిర్మాణానికి విరాళం

మధురపూడి: కోరుకొండలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో శాశ్వత పందిరి నిర్మాణానికి విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్ మంగళవారం విరాళం అందించారు. తొలి విడతగా రూ.లక్ష చెక్కును ఆలయ అధికారులకు అందజేశారు. నిర్మాణ పనులు మొదలు పెట్టిన తర్వాత మరో రూ.3 లక్షలు అందిస్తానని ఆయన తెలిపారు.

సారా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు



ముకుందవరం దాడుల్లో స్వాధీనం చేసుకున్న సారా తయారీ సామగ్రితో ఎక్సైజ్ సిబ్బంది

రంగంపేట: సారా స్థావరాలపై దాడులు నిర్వహించి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు ఎక్సైజ్ సీఐ సుధ తెలిపారు. మండల పరిధిలోని బాలవరం, ముకుందవరం, సుభద్రంపేట గ్రామాల్లో స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ మరియు రాజమహేంద్రవరం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో కలిసి మంగళవారం దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో 6 మద్యం బాటిళ్లు, 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, 300 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు చెప్పారు. సారా తయారీకి ఉపయోగించే సామగ్రిని స్వాధీనం చేసుకున్నామన్నారు. పచ్చికోళ్ల పేరయ్య, కేతా శ్రీనులను అరెస్టు చేసి ఇరువురిపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

ప్రాచీన ఆలయాలను దర్శించిన ప్రధాన న్యాయమూర్తి



బిక్కవోలు జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీతకు జ్ఞాపికను అందిస్తున్న ఆలయ ఈవో రామలింగ భాస్కర్

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలులో కొలువైన ప్రాచీన ఆలయాలను జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత దర్శించుకున్నారు. మంగళవారం బిక్కవోలులోని లక్ష్మీ గణపతి ఆలయం, కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాలను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు పూర్ణకుంభంతో ఆమెకు స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. వేద పండితులు ఆశీర్వచనాలు అందించి స్వామివారి జ్ఞాపికను అందించారు.

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలులో కొలువైన ప్రాచీన ఆలయాలను యశోద సినిమా డైరెక్టర్లు హరిష్ నారాయణ, కె.హరిశంకర్‌లు దర్శించుకున్నారు. వేద పండితులు ఆశీర్వచనాలు అందించి స్వామివారి జ్ఞాపికను అందజేశారు.

అలరించిన రాజనర్తకి నాటకం

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు కుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద నిర్వహించిన రాజనర్తకి పౌరాణిక నాటకం అలరించింది. సోమవారం రాత్రి షష్ఠి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం కమిటీ సభ్యులు కళాకారులకు జ్ఞాపికలు అందించారు.